## 'హిందూ' గ్రూపు పత్రికల పరిశోధన

ఇటీవల ది హిందూ, ఫ్రంట్‌లైన్ పత్రికలు చైనా, ఇండియాల డాక్యుమెంట్ల ఆధారంగా ఈ సమస్యపై కొంత పరిశోధన చేశాయి. ఈ పత్రికల ప్రకారం- చైనా దాడి చేయడానికి ముందు అంతర్జాతీయ సమావేశాల్లో యుద్ధ సంకేతాలు ఇచ్చింది. మెక్ మెహన్ రేఖకు ఉత్తరాన గల భారత సైనిక పోస్టులు తమకు అంగీకారం కాదని తెలిపింది. జులై 20, 1962న చైనాలో భారత రాయబారిగా ఉన్న ఆర్.కె. నెహ్రూ, చైనా ఉప విదేశీ మంత్రి ఝాంగ్ హన్ఫుల మధ్య జెనీవాలో జరిగిన చర్చల్లో భారత సైనికుల కదలికలు యుద్ధానికి దారితీస్తాయని ఝాంగ్ హెచ్చరించాడు. (చైనా పత్రాలను ఉటంకిస్తూ ది హిందూ తెలిపిన విషయమిది). దీనికి భారత్ స్పందించలేదు.

అంతకుముందు 1960లో చైనా ప్రధాని చౌ ఎన్ లై భారత్ పర్యటించి మెక్ మెహన్ రేఖను సరిహద్దుగా గుర్తించడానికి ప్రతిపాదించారు. భారత్ అప్పుడు కూడా ఏ విషయమూ చెప్పలేదు. కానీ, పశ్చిమ సెక్టార్‌లో ఆక్సాయ్ చిన్‌ను తమ భూభాగంగా గుర్తిస్తూ నెహ్రూ ప్రభుత్వం భారతదేశ పటాన్ని ప్రకటించింది. అక్టోబర్ 20, 1962న చైనా పూర్తిస్థాయి సైనిక చర్యకు దిగింది. చైనా సైన్యం భారత సేనలను మెక్ మెహన్ రేఖకు దక్షిణానికి నెట్టివేయడమే కాక ఇంకా లోపలికి చొచ్చుకువచ్చింది. అయితే మెక్ మెహన్ రేఖ వెనక్కి ఉపసంహరించుకోవడమే కాక యుద్ధఖైదీలుగా పట్టుకున్న భారత సైనికులను అప్పగించింది. చైనా హెచ్చరిక చేయలేదని చెప్పడంలో నిజం లేదని, జెనీవా సమావేశంలో వారు తగిన సూచన చేశారని తర్వాత రోజుల్లో ఆర్.కె. నెహ్రూ, జర్నలిస్టు ఏ.జి.నూరానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం.

## సరిహద్దు సమస్య

కాశ్మీర్లో కూడా చైనాతో ఉన్న సరిహద్దురేఖ నిర్ధారణ కాలేదు. అక్సాయ్ చిన్‌ను కాశ్మీర్ నుంచి వేరు చేసే వాస్తవాధీన రేఖ (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్- LAC) తాత్కాలికం మాత్రమే. అక్సాయ్ చిన్‌ను భారత భూభాగంలో చూపుతూ భౌగోళిక పటం ప్రచురించడం కూడా చైనా దాడికి ప్రేరేపించిన కారణాల్లో ఒకటి. నిజానికి అక్సాయ్ చిన్‌లో సైనిక పోస్టులను నియమించడానికి కూడా భారత ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. సైనికంగా, రాజకీయంగా, వనరుల పరంగా... ఎలా చూసినా ఆ ప్రాంతానికి విలువ లేదని భారత సైన్యాధికారులు అప్పటి ప్రధాని నెహ్రూకు చెప్పడమే దీనికి కారణమని భారత పత్రాలు చెపుతున్న విషయం.

ఇక ఎల్.ఓ.సి. (లైన్ ఆఫ్ కంట్రోల్) సంగతి తెలిసిన విషయమే. కాశ్మీరును భారత్, పాక్‌లు రెండుగా పంచుకున్న రేఖ ఇది. కాశ్మీర్ విషయంలో రెండు దేశాలూ పడుతున్న తగాదా కాశ్మీర్ ప్రజలకు సుఖశాంతులను దూరం చేస్తోంది. భారతదేశానికి నిర్ధారిత సరిహద్దు లేకుండా చేస్తోంది. వెరసి భారతదేశానికి ఈశాన్య దిక్కులోనూ, ఉత్తర దిక్కున కాశ్మీర్‌లోనూ సరిహద్దులు నిర్ధారణగా లేవు. సరిహద్దుల రక్షణ కోసం అంటూ నియమించిన సైన్యాలు తమ జాతుల ప్రయోజనాలను అణచివేస్తున్నాయని ఈశాన్య రాష్ట్రాల ప్రజలు అసంతృప్తితో సాయుధ ఘర్షణలకు దిగుతున్నారు. మరోవైపు ఈ పరిస్థితి దేశంలోని రాజకీయ పార్టీలకు ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడానికి ఉపయోగపడుతోంది.

బ్రిక్స్ సమావేశాల తర్వాత భారత్, చైనాలు మరింత దగ్గరైనందున సరిహద్దు సమస్యను 'ఇచ్చిపుచ్చుకోవడం' ద్వారా పరిష్కరించుకునే అవకాశాలు పెరిగాయి. అదే జరిగితే ఈశాన్య ఉద్రిక్తతల్లో ఒక అంకం ముగిసి అక్కడి ప్రజలకు సాపేక్షికంగా ప్రశాంతత సమకూరుతుంది. ప్రశాంత పరిస్థితులు జాతీయ సమైక్యతకు బాటలు పరుస్తాయి.

*రచయిత జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సైట్ http://teluguvartalu.com నిర్వాహకులు.*